క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మాజీ విప్‌ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్‌: జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజనను మాజీ విప్‌ సామినేని ఉదయభాను కలిశారు. విజయవాడలోని కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు అంశాలను కలెక్టర్‌తో చర్చించినట్లు ఉదయభాను తెలిపారు.

అమ్మినేనికి సత్కారం



నందిగామ: తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలప్రసాద్‌ను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం సత్కరించారు. రైతు సమస్యల పరిష్కారానికి ఆయన కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో 14వవార్డు కౌన్సిలర్‌ కామసాని సత్యవతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

జగ్గయ్యపేట అర్బన్‌: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఈనెల 7వ తేదీ ఆదివారం జరుగుతుందని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం వారు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న బి కన్వెన్షన్‌ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో మాజీ ప్రభుత్వ విప్‌ సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

నేడు హుండీల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ హుండీలను శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ ఆవరణలో లెక్కించనున్నట్లు ఈవో కె.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈలెక్కింపులో ఆలయ సిబ్బందితోపాటు భక్తులు కూడా పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఆసక్తిగల భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొనాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



నందిగామ: యూటీఎఫ్‌ సభ్యత్వ నమోదు కార్యక్రమం నందిగామ మండలంలో రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. యూటీఎఫ్‌ మండల అధ్యక్షుడు ఎం.వి.ఎస్‌.ఎస్‌.బెనర్జీ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరం, చెరువుకొమ్ముపాలెం, తక్కెళ్ళపాడు, లింగాలపాడు, అడవిరావులపాడు, అంబారుపేట, ఐతవరం, కంచల గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్‌ నాయకులు చిన్నం నరసింహారావు, జక్కనాచారి, బి.రామారావు, యలమందయ్య, రమణ, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

బైక్‌ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ):ఇంటి ముందు పార్కింగ్‌ చేసిన బైక్‌ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్‌ కొండ్రు వారి వీధికి చెందిన ఇస్మాయిల్‌ బేగ్‌ కుటుంబం నివాసం ఉంటుంది. బేగ్‌ వెల్డింగ్‌ పని చేస్తుంటాడు. బేగ్‌ తన అవసరాల కోసం బైక్‌ను కొనుగోలు చేసి వాడుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్‌ చేసిన బేగ్‌ మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి బైక్‌ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆటో ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ):ఆటో ఢీకొని భార్యాభర్తలకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్టినగర్‌ ప్రైజర్‌పేట కొండ ప్రాంతంలో యర్రసాని దాసు, విజయ దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం దాసు, విజయ ఎర్రకట్ట వద్ద రోడ్డు దాటుతుండగా, ఓ ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలకు గాయాలు కాగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్తగా రెండు డయేరియా కేసులు నమోదు



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట మండలంలో కొత్తగా రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. మండలంలోని బూదవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ శుక్రవారం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిలో నలుగురు డయేరియా బాధితులు డిశ్చార్జి కాగా, మెరుగైన చికిత్సకోసం ఇక్కడి నుంచి ఓ వ్యక్తిని విజయవాడకు పంపించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఏడుగురు డయేరియా బాధితులు చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో జగ్గయ్యపేట పట్టణానికి చెందినవారు ముగ్గురు, బూదవాడ గ్రామం నుంచి ఇద్దరు, పోచంపల్లి నుంచి ఒకరు, వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఉన్నారు.

డీసీహెచ్‌ఎస్‌ పరామర్శ...

డయేరియా బాధితులను డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ బీసీకే నాయక్‌ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలపై సిబ్బందితో మాట్లాడారు. మెరుగైన చికిత్సను అందించాలని ఆస్పత్రి సూపరిండింటెంట్‌ ఆళ్ల హరీష్‌కు సూచించారు. ఈసందర్భంగా డాక్టర్‌ బీసీకే నాయక్‌ మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలలో డయేరియా అదుపులోనే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా ఉధృతి తగ్గిపోయిందన్నారు. వారం రోజుల్లో డయేరియా పూర్తిగా తగ్గిపోతుందని, కొత్త కేసులు నమోదు కావని ఆశిస్తున్నట్లు వివరించారు. డయేరియా నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

డయేరియా ఉధృతి తగ్గింది : డీఎంహెచ్‌వో

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా కేసులు గణనీయంగా తగ్గాయని డీఎంహెచ్‌వో డాక్టర్‌ ఎం.సుహాసిని తెలిపారు. పేట మండలంలోని చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేటలోని వైద్య శిబిరాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పేట ప్రభుత్వాస్పత్రిలోని డయేరియా బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుహాసిని మాట్లాడుతూ షేర్‌మహ్మద్‌పేటలోని చెరువు వద్ద ఉన్న బావిని పరిశీలించి, పారిశుద్ధ్యం మెరుగునకు పంచాయతీ అధికారులకు తగిన సూచనలిచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారుల సమన్వయంతో డయేరియా నివారణ చర్యలను పటిష్టంగా అమలుచేస్తున్నామని వివరించారు. గ్రామాలలో డయేరియాపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ఇంటింటి సర్వే కూడా వైద్య సిబ్బంది పూర్తిచేశారని తెలిపారు. డయేరియా బాధితులను పరామర్శించిన వారిలో ఎయిడ్స్‌ అండ్‌ లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్‌ జె.ఉషారాణి, జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి ఉన్నారు. కార్యక్రమంలో పేట సీహెచ్‌సీ సూపరిండెంట్‌ హరీష్‌, బూచవరం, వత్సవాయి పీహెచ్‌సీల వైద్యాధికారులు అనిల్‌కుమార్‌, స్రవంతి, సుష్మా, వాసంతి, వైద్యులు నవీన్‌, సమీర, సునీల్‌, విద్యాసాగర్‌, మూడు మండలాల పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.



పేషంట్లను పరామర్శిస్తున్న డీసీహెచ్‌ఎస్‌ నాయక్‌



చిల్లకల్లులో వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

సైబర్‌ నేరగాళ్ల విషయంలో అప్రమత్తత అవసరం

వీరులపాడు:సైబర్‌ నేరగాళ్ల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు సూచించారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజలను పక్కదారి పట్టించి సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విదేశాలలో, పక్క రాష్ట్రాలలో ఉంటున్న ఇక్కడి బంధువుల వివరాలు సేకరించి వీడియో కాల్స్‌ చేస్తూ డబ్బులు వసూలుచేసేందుకు యత్నిస్తున్నారని వివరించారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలనే లక్ష్యంగా చేసుకుని సైబర్‌ నేరగాళ్లు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గిఫ్టుల పేరుతో డబ్బులు చెల్లించమనే వారి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానాస్పద ఫోన్‌ కాల్స్‌ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్‌ చేసి డబ్బులు ఇవ్వాలంటూ ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే అటువంటి సైబర్‌ నేరగాళ్ల సమాచారాన్ని వెంటనే సెల్‌ నంబరు 9440796458కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

పాఠశాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా ఉపాధ్యాయులు చూడాలని ఎంఈవో పాల్‌ కెనడీ సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యుపి పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసిన భోజనాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా సులభరీతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయటంతోపాటు సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ



వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ):మహిళలు తమ అభివృద్ధికి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని టప్పర్‌ వేర్‌ డిస్ట్రిబ్యూటర్‌ ఆఫ్‌ ఏపీఎండీటీ హేమవతి రాజ్యలక్ష్మి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్‌ స్టడీ సెంటర్‌ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్కూటీ ట్రైనింగ్‌ క్యాంపు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హేమవతి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆ క్రమంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు సమాజంలో ముందుకు సాగాలని చెప్పారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం తమ కళాశాల ఉమెన్స్‌ స్టడీ సెంటర్‌ విభాగం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి. నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు టీ విజయలక్ష్మీ, సెంటర్‌ కన్వీనర్‌ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్‌ కమిషనర్‌



సెక్రటరీలు, శానిటరీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్‌ నాగమల్లేశ్వరరావు



పట్టణంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్‌

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలో పలువురు డయేరియా వ్యాధికి గురవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ సీహెచ్‌.నాగమల్లేశ్వరరావు సూచించారు. స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ దుర్గాప్రసాద్‌తో కలిసి పట్టణంలోని ఆయా వార్డుల్లో పర్యటించారు. ప్రధాన డ్రెయిన్లలో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత కమిషనర్‌ తన కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఆరోగ్య విభాగం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్‌ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. డయేరియా కేసు నమోదైన పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్ప్రేయింగ్‌, ఫాగింగ్‌, బ్లీచింగ్‌ చల్లిస్తున్నట్లు వివరించారు. రైతుబజారు నుంచి పాత మున్సిపల్‌ కార్యాలయం మీదుగా ఎస్‌బీఐ వరకు మేజర్‌ డ్రైయిన్లలో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు. తమ గృహాల ముందు కాలువలపై ఉన్న సిమెంట్‌ బిళ్లలు, బండలను ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. లేకుంటే తామే పగులగొట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు అధ్వానంగా మారిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయన్నారు. ఆయా ఖాళీ స్థలాల యజమానులు విధిగా తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానా విధించి, ఆ డబ్బులతో తామే ఆయా తామే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాల్సి వస్తుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులబారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పట్టణ ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కమిషనర్‌ సూచించారు.

దోమల నివారణతో వ్యాధులకు చెక్‌

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం

పెనుగంచిప్రోలు: వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణంలో పలుమార్పులు వస్తున్నాయి. దీంతో వ్యాధులు కూడా ప్రబలుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే చాలావరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఆడ అనాఫిలెస్‌ దోమ కుడితే మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంలో నిల్వ ఉండే నీటిలో, మంచినీటి తొట్టెలపై పెరుగుతుంది. మలేరియా..వణుకుతో కూడిన జ్వరంతో ఉంటుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పట్టి తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఈవ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల్లో దోమల ఉధృతి లేకుండా చూసుకోవాలి. అలాగే డెంగీ టైగర్‌ దోమల కారణంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా నిల్వ ఉన్న నీటిలో పెరుగుతుంది. డెంగీ జ్వరం 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. చికెన్‌ గున్యా అనే వ్యాధి ఈడిస్‌ అనే దోమ కారణంగా వ్యాప్తి చెందుతుంది.

ఈవ్యాధి కూడా మామూలుగా 10 నుంచి 14రోజుల వరకు ఉంటుంది. జ్వరం తగ్గినా 10 రోజుల వరకు నొప్పులు ఉంటాయి. క్యూలెక్స్‌ దోమ కుడితే మెదడు వాపు వ్యాధి వస్తుంది. ఈదోమ ఎక్కువగా మురుగు నీటిలో పెరుగుతుంది. ఈవ్యాధి ఎక్కువగా 2 నుంచి 14ఏళ్ల లోపు చిన్నారులకు వస్తుంది. ఈవ్యాధులన్నీ దోమల కారణంగానే వస్తాయి. అశ్రద్ధ చేస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చును. ఇప్పటికే జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో నీటి కలుషితంతో పలువురు డయేరియా బారినపడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.



పెనుగంచిప్రోలులో బ్లీచింగ్‌ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



పెనుగంచిప్రోలులో నీటి పరీక్షలు చేస్తున్న సచివాలయ సిబ్బందితో సర్పంచి పద్మకుమారి

దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు...

దోమల నివారణకు గుంతలు, లోతట్టు ప్రదేశాలు, వినియోగంలో లేని బావులను పూడ్చివేయాలి. నీరు నిల్వ లేకుండా చేయాలి. చెత్తా, చెదారం మురుగు కాలువల్లో చేరకుండా చూడాలి. ప్రజలకు సరఫరా చేసే నీటిని కూడా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయిస్తుండాలి. ఇళ్ల పరిసరాల్లో ఉండే గుంతల్లో మురుగు నీరు అధిక కాలం నిల్వ ఉంచకుండా చూడాలి.


వైద్యులను సంప్రదించాలి..



ఈ సీజన్‌లో జ్వరం రాగానే వైద్యులను వెంటనే సంప్రదించాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే అవసరమైన పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

–పి.ఇందిర, పెనుగంచిప్రోలు వైద్యాధికారి

కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతుల సంఘం ప్రతినిధులు, కౌలురైతులు

జగ్గయ్యపేట అర్బన్‌: సీసీఆర్‌సీ చట్టం–2019కు సవరణ చేయడంతోపాటు కౌలు రైతుల చట్టం –2011ను అమలు చేయడం ద్వారా కౌలు రైతులందరికి గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కౌలురైతులు శుక్రవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య)ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ కౌలురైతులకు భూయజమానుల అంగీకారంతో సంబంధం లేకుండా నేరుగా భూమి సాగుచేస్తున్న కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలురైతుల రక్షణ కోసం 2011 లో ఏర్పాటుచేసిన భూ అధీకృత చట్టం ద్వారా భూమి యజమానితో సంబంధం లేని విధంగా కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. బ్యాంకుల ద్వారా కౌలురైతులకు రుణాలు మంజూరు చేయించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కౌలురైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్‌ మాట్లాడుతూ కౌలురైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినవారిలో కౌలురైతు సంఘం పేట మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, ప్రతినిధులు సయ్యద్‌ మస్తాన్‌వలీ, షేక్‌ మదార్‌, షేక్‌ కాసులు, ఉమ్మడి వెంకటేశ్వర్లు, కౌలురైతులు ఉన్నారు.

పెన్షనర్లు ఇన్‌కంటాక్స్‌ రిటర్న్‌ దఖలు చేయాలి



మాట్లాడుతున్న రామ్మోహనరావు

కంచికచర్ల: సబ్‌ ట్రెజరీలో టీడీఎస్‌ కోతకు సంబంధించి ప్రభుత్వ పెన్షనర్లు అదే కార్యాలయంలో ఫారం 16 పెన్షన్‌ స్టేట్‌మెంట్‌ తీసుకుని గడువులోగా ఐటీ రిటర్న్‌లు దఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రిటైర్డ్‌ ఎంప్లాయిస్‌తో సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైర్డ్‌ ఎంప్లాయిస్‌కు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్‌ డిపాజిట్లు ఉన్నట్లయితే వాటి మీద వడ్డీతో కలిపి రూ.3లక్షల ఆదాయం దాటితే తప్పకుండా రిటర్న్‌ దఖలు చేయాలన్నారు. టాక్స్‌ పడలేదని నిర్లక్ష్యం చేయవద్దని, ఆదాయం రూ.7లక్షల లోపల ఉంటే యూఎస్‌ 87–ఏతో రూ.25వేలు టాక్స్‌ రిబేట్‌ ఉన్నందను టాక్స్‌ కట్టాల్సిన అవసరంలేదన్నారు. ఏదేని సమాచారం కావాలంటే సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్లకు కంటి వైద్యపరీక్షలు...

స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో విజయవాడ మాక్సివిజన్‌ ఐ సూపర్‌ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వారిలో ఆరుగురికి కాటరాక్ట్‌ శస్త్ర చికిత్స చేయాలని నిర్ధారించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని త్వరలో విజయవాడ తీసుకెళ్లనున్నట్లు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, సంఘ నాయకులు నాగేశ్వరరావు, లక్ష్మణరావు, సీహెచ్‌ స్వర్ణలత, మోహిద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ఇసుక అక్రమరవాణా వాహనాల ధాటికి దెబ్బతిన్న వాగు కల్వర్టు



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ

శనగపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని మునేరు నుంచి ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని తోటచర్ల గ్రామానికి చెందిన టీడీపీనాయకులు, శనగపాడు గ్రామ టీడీపీ నాయకుల సహకారంతో మునేరు నుంచి ఇసుకను జేసీబీ ద్వారా ట్రాక్టర్లతో ఒడ్డున డంప్‌ చేస్తున్నారు. అక్కడ నుంచి జేసీబీతో లారీల్లో నింపి ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం రాత్రి గ్రామం నుంచి అనాసాగరం వెళ్లే దారిలో వాగు కల్వర్టుపై అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీ దిగబడిపోయింది. వాగు కల్వర్టు దెబ్బతింది. విషయం గమనించి గ్రామస్తులు ఆందోళన చేయగా, ఇసుక అక్రమరవాణాదారులు తమపై దాడులకు పాల్పడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీరు రాకపోవడంపై మహిళల ఆందోళన

- రోడ్డుపై బైఠాయించి వాహనాల నిలుపుదల
- తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్‌



తాగునీరు సరఫరా చేయాలంటూ రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేటకు తాగునీరు సరఫరా చేయకపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆప్రాంత మహిళలు శుక్రవారం రాత్రి రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు.

గత వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో తాగునీరు బాగానే వచ్చేవని, టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌ను నిలువరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. విలియంపేటకు చెందిన బాధిత మహిళలు మాట్లాడుతూ కొద్దిరోజులుగా విలియంపేటలో కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదన్నారు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో ఏరోజు ఇలాంటి పరిస్థితి రాలేదని పేర్కొన్నారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో తమ విలియంపేటలో కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా రాకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వంలో స్థానిక నాయకులు మేల్కొని విలియంపేటకు తాగునీరు సరఫరా చేయాలని మహిళలు కోరుతున్నారు.

విజయదుర్గా ఆలయంలో చండీ హోమం



చండీ హోమంలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం, అమావాస్య నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి విశేష అలంకరణ , పూజలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌ శర్మ నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు.

ఆకట్టుకున్న హరికథాగానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం ఒంగోలుకు చెందిన వేదవతి భాగవతారిణి ఆలపించిన హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వేదవతి శివలీలలు, అమ్మవారి మహిమలపై చక్కటి వ్యాఖ్యానంతో హరికథను ఆలపించారు.నాగమల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ వాయిద్య సహకారం అందించారు.